క్లుప్తంగా

హాస్టళ్లలో దోమల మందు పిచికారీ



దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

కడియం: స్థానిక ఎస్సీ బాలికలు, బీసీ బాలుర వసతి గృహాల్లో గురువారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కడియం పంచాయతీ సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.సుదర్శనరావు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే కొన్ని వ్యాధులకు దోమలు కూడా ఒక ప్రధాన కారణమన్నారు. విద్యార్థులు వాటి బారిన పడకుండా ఉండడానికి హాస్టళ్లలో ఏసీఎం స్ప్రేయింగ్ చేయించామన్నారు. హాస్టల్ గదులు, పరిసరాల్లో మందును చల్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీబీ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం గర్భకోశ నివారణ పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఏడీ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక బస్టాండ్ ఎదురుగా గల అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే తదితరులు పుష్పాంజలి ఘటించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ: సీజనల్ వ్యాధులైన డయేరియా, అనీమియా తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి సూచించారు. నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ కె.నాగలక్ష్మి, కంబాలచెరువు యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, డీఐవో రాజకుమారి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

కడియం: నిర్లక్ష్యంగా లారీని నడిపి ఇద్దరిని గాయాల పాల్జేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏడో అదనపు జడ్జి పి.బాబు గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2019 నవంబర్ 19న వేమగిరి గట్టు వద్ద మోటారు సైకిల్‌పై యనమదల నవీన్‌కుమార్, కృపానంద వెళుతున్నారు. వారిని ధవళేశ్వరానికి చెందిన బి.మహేష్ కిరణ్ లారీతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరూ గాయాలపాలయ్యారు. దీనిపై అప్పటి ఎస్సై షేక్ అమీనాబేగం కేసు నమోదు చేశారు. విచారణలో లారీ డ్రైవర్ నేరం నిరూపణ కావడంతో ఏడాది జైలు శిక్ష విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపినందుకు రూ.500 జరిమానా విధించారు. ఏపీపీగా ఓ.మహాలక్ష్మి వ్యవహరించగా, సాక్షులను కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ ప్రవేశ పెట్టారు.

పారిశుధ్య మెరుగుకు ప్రజలు సహకరించాలి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాలలో పూర్తి స్థాయి పారిశుధ్య నిర్వహణకు ప్రజలకు సహకారం అవసరమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన గురువారం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజీలలోని పూడికలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను పంచాయతీ సిబ్బంది, పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి గోరంట్ల చేపట్టారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్అండ్ఆర్డీ బాబూరావు, పంచాయతీకార్యదర్శి రూప్‌చంద్, మండల పార్టీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
అనుశ్రీసినిమాస్	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యప్యాలెస్	దేస్పికేబుల్‌మి 4
సూర్యమినీ	కల్కి
స్వామి	మహారాజ
అశోక	కల్కి
రాజా	కల్కి
శివజ్యోతి	మనమే
రంభ	14
ఊర్వశి	కల్కి
మేనక	బాక్
అప్సర	కల్కి
కుమారి	హరోంహర, కల్కి (3షోలు)
నామవరం	
వీఎస్ మహల్	కల్కి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కల్కి
కడియం	
వెంకటసూర్య	కల్కి

ఆ యాప్‌లతో చెల్లింపులకు స్వస్తి

- విద్యుత్ బిల్లుల చెల్లింపులో కొత్త నిబంధనలు
- ఫోన్‌పే, జీపే, పేటీఎంలతో ఇక కుదరదు
- ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: ఇప్పటి వరకూ విద్యుత్ బిల్లులను యాప్‌ల ద్వారా చెల్లించేవాళ్లం. ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐల ద్వారా నేరుగా కట్టేవాళ్లం. ఇకపై అలా చేయడం కుదరదు. యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులకు ఏపీఈపీడీసీఎల్ స్వస్తి పలికింది. ఇక నుంచి కేవలం ఏపీఈపీడీసీఎల్ వెబ్ సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ల ద్వారా మాత్రమే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐల ద్వారా చెల్లింపులకు నో చెప్పింది. ఇందుకోసం ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాలు జారీ చేశారు.

కొత్త మార్గదర్శకాలు

విద్యుత్ బిల్లులను చాలామంది వినియోగదారులు కౌంటర్లలో చెల్లిస్తారు. గ్రామాలలో నెలకు ఒకసారి ఏపీఈపీడీసీఎల్‌కు సంబంధించిన సిబ్బంది వచ్చి కట్టించుకుంటున్నారు. మరి కొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లలో చెల్లిస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలన్నీ వాటి నుంచే జరుగుతున్నాయి. ముఖ్యంగా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్‌ల నుంచి చెల్లింపులను నిలిపివేశారు.



ఈస్టర్న్ పవర్ యాప్



యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే విధానం

పేమెంట్ సులభం

సాధారణంగా యాప్‌ల ద్వారా బిల్లు చెల్లించడం చాలా సులువుగా ఉండడంతో చాలా మంది వినియోగదారులకు ఆ విధానంలో కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ బిల్లుల చెల్లింపు విషయంలో కూడా సులభ మైన పేమెంట్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే వీటిని ప్రజలకు చేరువ చేసింది

డౌన్‌లోడ్ చేసుకునే విధానం

- ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించాలనుకునే వినియోగదారులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ యాప్‌ను మొబైల్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దానికి అవసరమైన అనుమతులు ఇవ్వాలి. దీని ద్వారా చాలా సులభంగా బిల్లులు కట్టవచ్చు.
- వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించాలనుకునే వినియోగదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్ట్రన్‌పవర్.కమ్ ద్వారా పేమెంట్ చేయవచ్చు.
- యాప్, వెబ్‌సైట్‌లలో బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్లను కూడా ఉపయోగించుకోవచ్చు.

చాలా సులువు



ఈస్టర్న్ పవర్ యాప్‌ను, వెబ్‌సైట్‌ల ద్వారా వినియోగదారులు చాలా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీఐ ఆదేశాలను అనుసరించి సంస్థ ఈ విధమైన చర్యలు చేపట్టింది.

– టీవీఎస్ఎన్ మూర్తి, ఏపీఈపీడీ సీఎల్ ఉమ్మడి జిల్లా పర్యవేక్షక ఇంజినీర్

నర్సరీల్లో పర్యాటకం అభివృద్ధిపై సమీక్ష



నర్సరీ పాలక వర్గంతో సమావేశమైన టూరిజం, ఉద్యానశాఖాధికారులు

కడియం: కడియం ప్రాంత నర్సరీల్లో టూరిజం అభివృద్ధిపై సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలక వర్గ సభ్యులతో గురువారం జిల్లా టూరిజం శాఖాధికారులు, ఉద్యానశాఖాధికారులు సమావేశమయ్యారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, డీటీవో వెంకటాచలం, ప్రాజెక్టు డైరెక్టర్ ఆఫ్ ఏపీఎంఐపీ, హార్టికల్చర్ డీడీ హెచ్.దుర్గేష్, కడియం హార్టికల్చర్ ఆఫీసర్ డి.సుధీర్ కుమార్, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, సభ్యులు పాల్గొన్నారు. కడియపులంక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు అంశాలను చర్చించారు. కడియం నర్సరీలను పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి, పర్యాటకులను ఆకర్షించడానికి ఇంటర్నల్ కనెక్టివిటీ పాత్‌వేలు, ట్రీ హాట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రపంచానికి కడియం ప్రాంత నర్సరీలను మరింత చేరువ చేయడానికి సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

శిక్షణతో బోధనా పద్ధతుల మెరుగు



శిక్షణలో మాట్లాడుతున్న డీఎస్ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: బోధనా పద్ధతుల మెరుగు కోసమే ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ అందిస్తున్నారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా టీచ్ టూల్‌పై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. వాటిని గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. సందేహాలుంటే ఇక్కడే సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, రూరల్ ఎంఈవో అయ్యంకి దుర్గా తులసీదాస్, ఎంఈవో–2 చందు కుమార్, విషయ నిపుణులు పి.రమేష్ బాబు,ఎమ్.నాగేశ్వరరావు, జీవీ రమణ, సంధ్యారాణి, పి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న విద్యార్థిని

రాజమహేంద్రవరం రూరల్: చదువుతో పాటు క్రీడలలో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ వైద్యులు బిక్కిన రామ్‌మనోహర్, ఎం.రామమోహన్ అన్నారు. స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో గురువారం ఐసీఎస్‌సీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ బ్యాడ్మింటన్ పోటీలను పాఠశాల చైర్‌పర్సన్ విజయ యేలేటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైద్యులు బిక్కిన రామ్‌మనోహర్, ఎం.రామమోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో రెండు రాష్ట్రాల నుంచి 22 ఐసీఎస్‌సీ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు నృత్యాలు ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి మాట్లాడుతూ అండర్ 14, 17, 19 కేటగిరీలలో ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈ నెల 6వ తేదీ వరకూ జరుగుతాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై గురువారం రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సదస్సులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.రామ్‌నారాయణ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.రాధికాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.వీరేంద్రనాథ్, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం బొమ్మూరులోని మహిళా ప్రాంగణం వద్ద సమావేశం నిర్వహించి, నల్సా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, సీడీపీవో ఐసీడీఎస్ రాజానగరం నాగమణి, ప్రజ్వల, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- కొనియాడిన మంత్రి దుర్గేష్
- ఘనంగా మన్యం వీరుడి జయంత్యుత్సవం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం గోదావరి బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో మహానుభావులలో అల్లూరి అగ్రగణ్యుడన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి, టూరిజం జాయింట్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో..

రాజమహేంద్రవరం రూరల్: అల్లూరి సీతారామరాజును విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అల్లూరి జయంతి నిర్వహించారు.

- బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.
- బొమ్మూరు వైటీసీలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ సి.ముఖలింగం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

కడియం మండలంలో..

కడియం: అతి చిన్న వయసులోనే దేశం కోసం అసువులు బాసిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షిరీన్ సిస్టర్స్ ఆలపించిన దేశభక్తి గేయం, లావణ్య ఉపన్యాసం ఆకట్టుకున్నాయి.

- స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

ధవళేశ్వరం: అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన జయంతిని ధవళేశ్వరం మసీదు సెంటర్‌లో మాజీ ఉప సర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాధనాల చంద్రశేఖర్(శివ), వేగిశెట్టి కోదండ రామారావు, శ్రీరంగం బాలరాజు, మెండా రాజేష్, ముత్యాల పోసికుమార్, ముద్దాల అను, పందెళ్ల భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో..

కంబాలచెరువు: జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎస్పీ పి.జగదీష్ పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాటాలు చిరస్మరణీయమని, నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) పి.అనిల్ కుమార్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, డీఎస్పీ(ఎస్‌బీ) డి.ప్రభాకర్, డీఎస్పీ (ఏఆర్) టీవీఆర్‌కే కుమార్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) సూర్య అప్పారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, వైస్ ప్రెసిడెంట్ జే. సాయి మహేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. కోటగుమ్మం సమీపంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీతారామరాజు బాల్యం, విద్యాభ్యాసం ఎక్కువగా మన గోదావరి జిల్లాలోనే జరిగిందన్నారు. ఆయన 1911లో రాజమహేంద్రవరంలో ఆరో తరగతి చదివారన్నారు.



ధవళేశ్వరంలో అల్లూరి జయంతిలో పాల్గొన్న నాయకులు



వ్యవసాయ కళాశాలలో అల్లూరికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కడియం హైస్కూలు ఉపాధ్యాయులు

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కృష్ణానగర్, కోర్లమ్మపేట, ఆర్యాపురం, తుమ్మలోవ ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



ధవళేశ్వరంలో రంగా జయంతిలో పాల్గొన్న నాయకులు

ధవళేశ్వరం: బాలికల హైస్కూల్ సెంటర్‌లోని వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద గురువారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. రంగా రాధ మిత్రమండలి సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత రంగా విగ్రహానికి డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, సాధనాల చంద్రశేఖర్ (శివ), ఆళ్ల ఆనందరావు, వేగిశెట్టి కోదండరామారావు, ముద్దాల అను, శ్రీరంగం బాలరాజు, ముత్యాల పోసికుమార్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పేదల పెన్నిధి వంగవీటి

కడియం: వంగవీటి మోహనరంగా పేదల పాలిట పెన్నిధి అని కడియం మండలం రంగా మిత్రమండలి సభ్యులు, కాపు ఐక్య వేదిక నాయకులు అన్నారు. రంగా జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రంగా యూత్ సభ్యులు చిలుకూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో దళితవాడలోని పాఠశాల విద్యార్థులు, బీసీ హాస్టల్ విద్యార్థినులకు గొడుకులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కడియం గ్రామానికి చెందిన ప్రముఖ కూరగాయల వ్యాపారులైన దొడ్డా సోదరుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కడియం, కడియపులంక, వేమగిరి, జేగురుపాడు, కడియపుసావరం, వీరవరం, దుళ్ల, వేమగిరి, పొట్టిలంక, వెంకయ్యమ్మపేట తదితర గ్రామాల్లో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: లోక్‌సభలో ఇండియా కూటమి ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న రాహుల్ గాంధీ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కక్ష పూరితంగా కుట్రలు, కుతంత్రాలతో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కంబాల చెరువు సెంటర్‌లో పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు. హిందువులకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ మాట్లాడారంటూ ప్రజలను రెచ్చగొట్టేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు.

బీజేపీ నాయకుల ధ్వజం

హిందువులకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడడం దారుణమని హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ సంయోజక్ శ్రీనివాస్, జిల్లా సంయోజక్ పట్నాల సూరిబాబు, ధర్మవీర్ వ్యవస్థాపకులు విజయ్ తపస్వి అన్నారు. ఈ మేరకు గురువారం పుష్కరఘాట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం రాహుల్ దిష్టిబొమ్మను ఊరేగించి, నిరసన తెలిపారు.

ప్రచార రథం దహనం కేసులో వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రచారరథం దహనం కేసులో వీఎల్ పురానికి చెందిన దంగేటి శివాజీని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని తూర్పుమండల డీఎస్పీ కిషోర్ గురువారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. నిందితుడిని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

జీతాలు ఇప్పించాలి

సీతానగరం: తమకు 14 నెలల జీతాలు ఇప్పించాలని పురుషోత్తపట్నంలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షుడు కట్టమూరి వీరబాబు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు తమ సమస్యను విన్నవించారు.

21న గురుపూజా మహోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో ఈ నెల 21వ తేదీన గురుపూజా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువు మామిడిపల్లి రామారావుకు ఘనంగా సన్మానిస్తారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందించారు. దాతలు డాక్టర్ ఘంటా గణేశ్వరరావు, రత్నం దంపతులు సుమారు 150 మందికి వీటిని సమకూర్చారు. పేదల ఇళ్లకు వెళ్లి సేవా సమితి సభ్యులు భోజనం పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య సూచించారు. స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.